

# యెప్పటికాలిట్టిట్టే

''యెన్ని సామెతలయాయోయ్ యిప్పటికీ?'' అడిగింది సునీథ. సునీథ సామెతల మీద పరిశోధన చేస్తున్న పరిశోధకురాలు.

'' ఆ ఆసనం అలంకరించు మిత్రమా. నీవు అడిగావని సమయం చిక్కినప్పుడల్లా వ్రాస్తూనే వున్నా. అయితే అక్షరక్రమంలో వ్రాయలేదు'' అన్నది శారద. ఆమె ముందు బల్ల. దాని మీద అద్దం. దాని మీద వ్రాత పరికరాలు.

సునీథ కూచుని కాగితాల మీదికి దృష్టి సారించింది.

'' ఆ పని తరవాత చూద్దాం. ఇవాళ ఫ్రెష్‌గా గుర్తు వచ్చిన సామెత యేమిటీ?'' సునీథ నవ్వుతూ అడిగింది. ''యెప్పటి కాలిట్టిట్టే'' అని నవ్వింది శారద.

''చిత్రంగా వున్నదే. భావార్థకమా? గూఢార్థమున్నదా?''

''యేమో. పక్కింటి దమయంతి పిన్ని తరుచూ వాడుతుంటే విన్నాను'' అని వాకిలి వేపు చూసింది శారద. ''అదుగో పిన్ని. మాటల్లో వచ్చింది. నూరేళ్లాయుష్షు. ఆసీనులు కండి పిన్నీ'' అన్నది శారద.

అది అసుర సంధ్యవేళ. రాగరంజితమైనట్టు లేత రంగు పులుముకున్నది ఆకాశం. మబ్బు తునకలు దూసర వర్ణము. సూర్యుడస్తమించే వేపునించి, తెలుపు కనకాంబరం రంగు లేత కిరణాల చివరలు అందంగా కనిపిస్తున్నాయి. కొబ్బరాకులు కదుల్తు మెరుస్తున్నాయి.

''కాఫీ వేళ కొచ్చానా? నూరేళ్లెందుకు? అరవై యెక్కువేమో?''

''నూరేళ్లూ వాడుకోవచ్చు పిన్నీ, కాఫీ వేళగాదు. నేనూ నా మిత్రము సునీథ సామెతలు సేకరిస్తూ, వాటి అర్థం అవెలా వచ్చాయయా అని పరిశోధిస్తున్నాము. మీకు చాలా వచ్చు. నాలుకమీద నాట్యమాడుతూ దొర్లిపోతాయి. ధారణ శక్తి వుండివుండాలి మీకు''.

''యే శక్తీ లేదు. చిన్నతనమంతా అటువంటివి చెవినబడుతూ

గడిచిపోయింది. పని, బడికి పంపలేదు నన్ను. ఇరుగుపొరుగు వారికీ సాయపడాలనేది తల్లి. అక్కడ పెద్దవాళ్ల గోష్ఠి. దొడ్లో బావిలో నీరు. పప్పుడకదు. మంచినీళ్ల బావి శంకరమఠంలో వున్నది. గొట్టపు బావుంటే బోరింగ్‌పంపున్నది. మంచి నీళ్లకెళ్తే క్యూలో నిలబడాలి. అక్కడా కబుర్లే. ముని వృత్తి లేదక్కడా. మునిస్వభావం మౌనం. చిన్ననాడు విన్నవి పుట్టెక ంటుకున్నాయి బాల్యం వదలగానే పెళ్లి. అడుసులో బడ్డ పిల్లికదే వైకుంఠలాగా తక్కిన జీవితం'' అని నవ్వింది పిన్ని''.

''అదుగో పిన్నీ! నేనన్నదదే. సామెతలు నాలుక మీద నాట్యమాడతై పిన్నికి అని చెప్తున్నా, ఫ్రెందుకి, యెప్పటికాలిట్టిట్టే అంటేసరైన అర్థం తెలియదు. యెలా ఆ సామెత యేర్పడిందీ అసలే తెలియదు.

''రెడ్డొచ్చె మొదలాడమని'' అని పిన్ని అంటుంటే యిద్దరూ నవ్వారు. ''దాని కర్థమూ తెలియదు. యెలా వాడుకలో కొచ్చిందీ అసలే తెలియదు. ముందీ లేటెస్టు సామెతకి చెప్పు పిన్నీ'' అన్నది శారద. '' ఇంటి పేరు కస్తూరి వారు, ఇంట్లో గబ్బిలాల కంపు అని, పేరేమో చదువుల తల్లి పేరు శారద. యేమీ తెలియదు. పోనిద్దాం కూతురా. నా చిన్నతనంలో, నేను పల్లెటూరి గబ్బిలాన్ని'' అని నవ్వి సాగించింది పిన్ని. పల్లెల్లో వీధినాటకాలాడేవారు''.

''మరో సామెత దొర్లిందప్పుడే శారదా'' అన్నది సునీథ.

''వినండి మరీ. ఆ కళాకారులనూ, ఆ కళనూ యెక్కువగా రెడ్లు పోషించేవారు. చాలా భూములు వారివే. వినోదమనేది మనిషికి తిండిలాగే అవసరం. కళాకారులలో తెలివైనవారుండేవారు. అంతా వచ్చారనుకుని రాత్రి యెనిమిదింటికి, గాసులైట్ల వెలుగులో, కాగడాల వెలుగులో నాటకం మొదలెట్టేవారు. తెర తొలగించి దేవుని స్తుతించి భూదేవికి మొక్కి ఆ రోజు నాటకం పేరు, దాని కథాకమామీషు క్లుప్తంగా చెప్పి మొదలెట్టేవారు. ఆనాడు మార్కండేయ. మృకండ మహాముని భార్యామరుద్వతి. వనవిహారానికెళ్తే ముని పత్నులొచ్చారు. వారితో ఆడిపాడి, భోజనానికి రమ్మన్నది మరుద్వతి. వచ్చారు.

వర్ణన పూర్తిఅయింది. ''పిల్లల్ని రమ్మను'' అన్నారు మునిపత్నులు. ''సంతుకలగలేదు'' అన్నది తలవంచుకుని. ''సంతులేని యిల్లు జంగాల మఠము'' అని లేచిపోయారు మునిపత్నులు. భర్తరాగానే చెప్పింది. సంతుకోసం భార్యాభర్తలిద్దరూ తపస్సు పుణ్యక్షేత్రంలో మొదలెట్టారు. సరీగ్గా అప్పుడు రెడ్డి భోంచేసి తాంబూలం నములుతూ వచ్చి కూచున్నాడు.

''పెద్ది రెడ్డి దొర వచ్చారు. మళ్లా మొదలు పెట్టండి'' అని సూత్రధారుడనగానే, నాటకం మళ్లా మొదలైంది. జరుగుతున్నది. రామిరెడ్డి పైబట్ట దిద్దుకుంటూ వచ్చి కూచున్నాడు. మళ్లా నాటకం మొదలు అలా రెడ్లు వచ్చినప్పుడల్లా నాటకం మొదటికొస్తే, మార్కండేయుడు, మృత్యువును జయించినవాడు పుట్టకముందే తెలతెలవారటం గమనించిన ప్రేక్షకులంతా నవ్వుతూ లేచారు. అది హాస్యం. మితిమీరిన గౌరవం చూపటం దానర్థం రెడ్డొచ్చె మొదలాడమని సామెత ఏర్పడింది'' అన్నది పిన్ని.

''కళాకారులేమైనారు'' అనడిగింది శారద.

''వాళ్లకి బాధే లేదు. ఆ వేషాలతోనే ఊళ్లో తిరుగుతూ, నాటకం పూర్తి చూస్తూ రెడ్లయిల్ల ముందాగి ఆటా పాటా చూపి, వారిచ్చింది సంతోషంగా తీసుకుని మధ్యాన్నానికి తిరిగి వెళ్లిపోయేవారు''. ''చాలా బావుంది. ఇదీ అలాటిదేనా పిన్నిగారూ'' అనడిగింది శారద.

'' ఆ, ఆ. ఇంచుమించు అలాటిదే. స్వభావం మారదు. అలవాట్లు మారవు అని చెపుతుంది ఆ సామెత'' దమయంతి పిన్ని లేచింది.

2

''శారదా! నీవిచ్చిన చేబదులిదుగో తెచ్చా. తీసుకో. మళ్లా ఖర్చయిపోయి నగదుండదు. శానామంది చుట్టాలొచ్చారే! నా మరిది హాస్యమాడుతూ యింతమంది రాగానే ''గాంగ్'' అంటాడు. యెవరివేపు? వాలకం చూస్తే సామెతలాగా వున్నదే. పరిహారంతోగాని రారేమో. జమాబంది అలవాటేమో'' శారద రాగానే అయిదువందల నోట్లు అయిదు లెక్కించి అందించింది పిన్ని.

'' ఇచ్చిన జ్ఞాపకం గిచ్చిన జ్ఞాపకం'' అంటూ శారదబుగ్గలు గిల్లి వెళ్లిపోయింది దమయంతి పిన్ని. శారూ వాటినెవరూ చూడకముందే గోద్రెజ్ బీరువా అరలో దాచి తాళం తిప్పిచ్చేప్పటికి, ''శారూ! విశాల అన్నవరంలో, తనకొడుక్కి నీలాలిస్తానని మొక్కుకున్నది రెండోయేట యివ్వరాదుట. యాడాది వెళ్లక ముందే యివ్వాలిట. మాకాటే టైం లేదు. విశాలేమో వుద్యోగస్తురాలు. కంప్యూటర్ పాసైంది. దాని మొగుడు వూరికే కూచుంటావా అని వుద్యోగమిప్పించాడు. నేను వెయ్యిళ్ల పూజారిని. పసికూనతో ఒక్కతే వెళ్లలేదు.వాళ్లాయన రానన్నాడు. పిచ్చి నమ్మకాలని నవ్వాడు. పేరే పెట్టనన్నాడసలు. నేనే నా డబ్బు తగలేసి పుణ్యావచనం చేయించా పిచ్చయ్య శాస్త్రి నా బంధువే. యధావిధిగా చేస్తుంటే, లుంగీకట్టి నిలబడి వింత చూస్తుంటే ''టెంకాయ కావాలి'' అన్నాడు పిచ్చయ్య శాస్త్రి. తననే అడుగుతున్నాడనుకుని ''గాడిదగుడ్డు కావద్దూ?'' అని యికిలిస్తూ వెళ్లిపోయాడు'' అని పనస చదువుతూ, ''కారుకి ఫోన్ చేశావా శారూ'' అని ఊదర పెట్టింది తల్లి శేషమ్మ. కారు కంటబడగానే బిలబిలమంటూ తమ్ముడూ మరదలూ దూరగలిగినంతమందిని దూర్చారు. తక్కినవారిని బస్‌లో రమ్మన్నారు. వాళ్లు నవ్వి ''మేము సింహాచలం వెళ్తున్నాము'' అంటే మరో యిద్దరు ''మేము కైలాష్ గిరిచూసి వస్తాము'' అని వెళ్లిపోయారు. గోస్తనీ తీరంలో సముద్రస్నానం చేయాలని యిద్దరు పెద్దలు వెళ్లారు భీమిలి. నలుగురు పిల్లల్ని యింట్లో వదిలి ''యెటూ పోకుండా చూడు శారూ'' అంటుండగా కారు కదిలింది.

శారద పరిశోధన అటకెక్కింది. ఆమె పక్కా యిల్లాలైంది. ఇంటి చుట్టూ బాగా స్థలమున్నది. ఆవూ, గేదె వాటి దూడలు వాటికి పాకలు, వాటిని చూసేందుకు గొల్లలు పాకలు వేసుకుని వున్నారు. ఇంటిపని చూసే మరో దంపతులు మరోవేపున్నారు. వారికిపక్కగా చాకలి కుటుంబము. కుక్కలు రెండు. కారు తుడవాలి. స్కూటరు తుడవాలి. డ్రైవరు ఫోన్‌చేస్తే వస్తాడు. టీ యివ్వాలి. పనివుంటే భోజనం పెట్టాలి.

''శారదా!'' పిట్టగోడమీదినించి దమయంతి పిన్ని పిలుస్తున్నది. వంట పని అయింది. తువాలుతో చేతులు తుడుచుకుంటూ శారద వచ్చింది. ''యేమిటి పిన్నీ''.

''నా చివరి చెల్లి కూతురు సుమతికి పెళ్లి చూపులు. వియ్యాలవారిదీ వూరే. నా చెల్లి యేలూరులో వున్నది. మరిది బాంక్ యేజెంట్. పెళ్లివారికి టియె యిచ్చే బదులు, పిల్ల చూపులీవూళ్లో జరపాలని ఆశ. పెళ్లివారూ అదే అన్నారు. రూమివ్వగలవా? నా చెల్లీ మరిదీ అన్నీ చూచుకుంటారు'' అని నవ్వుతున్నది పిన్ని. ''అలాగే'' అంటున్నది శారూ.

వాల్యూమ్ హెచ్చిన గొంతులు వినవచ్చాయి.

''అంత పెద్దగా పెట్టుకుంటేగాని దూరదర్శన్ మీద వచ్చే సీరియల్ వినబడదాయేం'' అన్నది శారద.

''దూరదర్శినీ గాదు. సీరియల్‌లోని మాటలు కావాలి. వాళ్లింటికి తండా వచ్చింది. యెప్పటికాలిట్టిట్టే అన్నట్టు చిన్న విషయానికి తగూపడి దుమ్మెత్తి పోసుకోటం, వీధికెక్కటం, గోరుతో పోయేదాన్ని, గొడ్డలితో కొట్టటం వారికి రివాజు. పోనీ రావటమూ ఆపరు. వస్తూ వుండాలి.గిల్లి కజ్జా పెట్టుకోవాలి. తమ గొంతులందరూ వినాలి. యేమనుకోకపోతే కూతురా! శారూ! మీ యింట్లో నించీ వినవస్తున్నాయి. నా కలవాటే గనక మెడరిక్కించి వినటానికి పిట్టగోడ దగ్గరికి రాను. వచ్చినవారు యిద్దర్నిక్కడే వదిలి వెళ్లకపోతే శారూ, చెవికదపాయించుకుంటా. ఊరూ నాడూ ఒకటి చేస్తే రైలెక్కుతారు వచ్చినవారు. చాలా తరహాలు వెలిశాయి గనకే అన్ని సామెతలొచ్చాయి'' పిన్ని నవ్వుతూ అన్నది.

''నువు పెళ్లివారిని వెంటబెట్టుకొస్తావా పిన్నీ? ఫోనూ, ఫానూ యెసి వున్న రూమే సిద్ధం'' అన్నది శారూ.

''ఫోన్ చేసి నేనే తెస్తా పెళ్లివారిని'' పిన్ని వెళ్లిపోయింది.

ఇంట్లో కొచ్చింది శారద. ఒకబ్బాయి చెట్టెక్కి జామపండుకోసి తింటూ

కొమ్మ విరిగి కిందబడ్డాడు. ఇంట్లోకి తెచ్చి బెడ్ మీదుంచి, డాక్టరుకి ఫోన్ చేసింది శారద.

మెడిసిన్ ఛెస్టుతో సహా వచ్చాడు వైద్యుడు. నాలుగిళ్ల అవతలే ఆయన సర్జరీ. ''కాలు ఫ్రాక్చర్ కాలేదమ్మా. పెణగబడిందంతే'' అంటూనే అందంగా బాండేజ్ చేశాడు. సెప్టిక్ కాకుండా ఇంజక్షనిచ్చాడు. అదంతా చూస్తూ వినోదిస్తున్న రెండో అబ్బాయి, తన చెవిలోని బాధ చెప్పాడు డాక్టరుకి. డాక్టరు సీరియస్‌గా చూసి, పిల్లవానిని బల్లమీద కూచోబెట్టి గుండ్రని అద్దమున్న చట్రాన్ని తన తలకు పెట్టుకుని చెవి పరీక్షించాడు. దాన్ని అవతలుంచి, గోరు వెచ్చని నీరు తెమ్మని, పిచికారీ సామాను తీసి బేసిన్ చెవి వద్ద వుంచి పట్టుకోమని, పిచికారీ చేసి, మరో శస్త్రం కత్తెరలాగా వున్నదానితో దూదిపట్టుకుని, చెవిలోపల తుడిచి దూది బేసిన్లో పడేసి, స్పిరిట్ చుక్కలు వేసి దూది పెట్టారు చెవుల్లో

''చెవిలో ఫంగస వచ్చిందమ్మా. జబ్బేం లేదు. ఇదుగో స్పిరిట్'' అని చిన్న సీసా అందించాడు చుక్కలు వేయటానికి ప్లాస్టిక్ ఫిల్లర్.

''రెండు చుక్కలేసి దూదిపెట్టండి. ఇదుగో దూది. రాత్రికి వేయాలి. బిడ్డ డాక్టరే వేయాలంటే సర్జరీకి పంపండి. దగ్గరే. ''మెడిసిన్ ఛెస్ట్ సద్దేశాడు. చేతులు కడుక్కుని శారద అందించిన టవల్‌తో తుడుచుకుని ఫీజు అందుకుని జేబులో కూరుకుని ఛెస్ట్ తీసుకుని వెళ్లిపోయాడు డాక్టరు. పిల్లలిద్దరూ గొప్పగా ఫీలైనారు డాక్టరింటికొచ్చి చూచాడని.

## 3

''శారూ!'' తలుపు చప్పుడు. శారద భర్త సేతురాము యంత్రం కొన్నాడు. దాని సాయంతో రెండు దీపాలు ఒక ఫానూ పనిచేస్తాయి. కరెంట్ కట్ వచ్చింది. సేతు రాము పర్సనల్ సెక్రటరీ. కలెక్టరు గారితో కాంపు వెళ్లాడు. ఎగ్జిబిషన్ ఓపెన్ చేయాలి. వరద బాధితులకు సాయం అందించాలి. ఇంకా పన్లున్నాయి. పిల్లలిద్దరు అటువేపు బెడ్ రూమ్‌లో స్క్రేబుల్ ఆడుతున్నారు. తలుపులేసుకున్నారు. పెద్ద కొవ్వొత్తి వెలుగుతున్నది. మనస్సు స్థిమితపడనిచ్చి, శరీరానికి వుపచారం చేసుకుని

అలసటను పారద్రోలి, పరిశోధన కాగితాలు ముందుంచుకుని చూస్తున్నది శారద. రాత్రి తొమ్మిదైంది. వీధి దీపాలూ రాలేదింకా. సునీథ మరికొన్ని సామెతలు సేకరించాననీ చూడమనీ, యిచ్చి వెళ్లింది పొద్దుకే వేళప్పుడు. ఆమె అకాడమీ సభ్యురాలైందిట. అకాడమీ ప్రచురించవచ్చుట. శారూ తలుపు తీసింది. దమయంతి పిన్ని నిలబడి వున్నది.

''రండి పిన్నీ! రాత్రి పూట వచ్చారేం'' అలా అంటూ పిన్ని లోపలికి రాగానే తలుపు గడియ వేసింది శారూ. బెడ్‌రూమ్‌లోకి తీసికెళ్లి సోఫాలో కూచోబెట్టి తాను మరో సోఫాలో కూచున్నది. లైట్లు వచ్చాయి. కొవ్వొత్తి ఆర్పింది. ''అలా వున్నారేం? ఒంట్లో బాగా లేదా?'' అన్నది. దమయంతి నవ్వు మొహం పెట్టాలని ప్రయత్నిస్తూ అన్నది.

'' ఇల్లు నిశ్శబ్దంగా వున్నదే? వచ్చిన మందలోని వారొకరు లేరా? వారిని తోలుకొచ్చిన లీడరు యిద్దర్నయినా వదిలేసి వెళ్లాలే? అది అలవాటామెకి. యేదో సీను వేసి, టియె గుంజి, పొరపాటైంది తెచ్చుకున్నదంతా ఖర్చు చేశాను. అయివేజు అందగానే నీది నీకు యమ్‌వొ పంపుతానూ'' అంటుంది. అది గ్రహపాటేమో. గ్రహచారం అలా చేయిస్తుంది. మహాకష్ట దశ తెచ్చిపెడ్తాయి గ్రహాలూనూ. వాటి అలవాట్లూ ''యెప్పటి కాలిట్టిట్టే'' శనైశ్చరుడు నలుని పట్టి, నిలువుదోపిడీ చేయించమేగాక, ఒంటిమీద బట్ట గూడా లేకుండా పావురాలెత్తుకు పోయేట్టు చేశాడు. పాముకాటుకి గురయే బుద్ధి పుట్టించాడు. వికార రూపం తెప్పించటమే గాక తెడ్డు చేతికొచ్చే స్థితికి తెచ్చాడు. పాండవుల పని పట్టింది ఆ గ్రహమే'' అంటున్నది.

శారద నవ్వింది ''నేనాటే గమనించకపోవటం వల్ల పిన్నీ, మీ వల్లే హాస్యాలాడలేను. ఇప్పుడిపుడే గమనిస్తున్నా. భారత్ మీదికి దండయాత్రలు జరిగినట్లే అన్యోన్యంగా వుంటూ, పొదుపుగా జీవించే దంపతుల మీదికీ, యిరువింగుల వారూ దండయాత్రలు చేస్తారు. వారి వద్ద డబ్బు మునిసిపల్ చెత్తలాగా పెరుగుతున్నదనుకుంటారేమో. ఘోరీ ధనరాసులను ఒంటెలమీద

సంచీలలో వేసి తీసికెళ్లాడుట. ఈ దండయాత్రీకులలోనూ ఆ పోలిక స్మాల్‌స్కేల్లో వున్నది. మళ్లా కాలుచేయీ కూడదీసుకునే లోపల మరో కైబర్ కనుమ గుండా మరొకరు దాడి చేస్తారు. దేశానికీ కుటుంబానికీ పోలికవున్నది''. పిన్ని విషాదంగా నవ్వుతూ, ''కాలు చేయి కూడదీసుకుంటుండగా హిందుకుష్ పర్వతమార్గాననే వచ్చినట్లున్నా శారదా'' అన్నది.

శారద నవ్వి అన్నది ''పోనీ అలానే అనుకుందాము పిన్నీ. చేబదులు కోసమా నిద్రవేళ వచ్చారు?''.

''సరిగా వూహించావు కూతురా. బాబాయిగారు తెగోదారికి తేలుకుట్టిందన్నట్లు, మేనగోడకి బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేయించి మరింక కనక్కర్లేకుండా బతికించారు. వాళ్ల పెద్దక్కకి గొంతులో కాన్సరని తెలిసి రాయవేలూర్ తీసికెళ్తూ నాకు యింటి ఖర్చులకివ్వకుండా వెళ్లారు చెల్లీ చిన్న బావా తోడు వెళ్లారు. పళ్ల బిగువున రోజులు గడిపినా చాలక కొన్ని తాకట్టు పెట్టి తెచ్చిన రొక్కంవాడాను. బాబాయి అయితే వచ్చారుగానీ యీ నెల యేమీ యిచ్చేట్లు లేవాయన మాటలు. నేను బండిలాగ లేను గానుగెద్దులాగా నూనె తయారు కావటానికి. కనీసం అయిదు వేలన్నా యివ్వగలరని గంపెడాశతో వచ్చా రాత్రివేళ'' అని కళ్లద్దుకుంటూ నవ్వింది పిన్ని. '' ఇచ్చేదాన్నేమోగానీ పిన్నీ. వూహించనివన్నీ జరిగాయి. దూడ మాయమైంది. గొల్లకోటమ్మ యేడుస్తూ వచ్చి, ''దూడనిడవనిదీ ఆవుపాలు చేపుకురావు తల్లీ. దూడ వెల రెండువేలిప్పుడు. మేక పదకొండు వేలు. కోడి వెయ్యి. మీ బందువే బుజానేసుకునెళ్తూ అమ్మ జూపుతుంటే చూసినవారు చెప్పారు. దూడకు మూడో నెల అంతే. వందకే అమ్మజూపాడుట'' అని గొల్లుగొల్లు మన్నది. అమ్మ నోట్లో కొంగు కూరుకుని విసవిసా వెళ్లింది. యెలా పట్టిందో పట్టింది మొత్తానికి బుజానవేసుకుని దూడ కాళ్లు పట్టుకుని వచ్చింది. ఈ లోపున నేను కోటమ్మకి రెండు వేలిచ్చి యేడవకు అమ్మ వెళ్లింది తెస్తుంది అన్నా. యెనిమిదీ తొమ్మిది గంటల మధ్య దూడను కోటమ్మ కందించి ''అదుగో నీ దూడ. మా అబ్బాయి క్లెప్టోమానియా. యేం

చేస్తుందో తెలియదు వాడికి మతిలేని పనిచేశాడు. నా ఖర్మ. మా అమ్మాయి డబ్బు చెల్లించినట్టుందే దూడనిచ్చాగా. అదిచ్చేచేయ్'' అని వురిమితే, కోటమ్మ దూడ దొరికిందనే తృప్తితో డబ్బు వాపస్ చేసిందట. ఆ డబ్బు కొంగున ముడేసుకుని బొడ్లో దోపుకుని యింట్లోకొచ్చింది తల్లి. నాకివ్వలేదు. ఆనాడే ప్రయాణం. పిన్నీ! మీ పక్కవాళ్లు కలవాళ్లే వారి నడిగి చూడలేదూ?''

''సడేలేశారూ. సౌడభ్యం. రోలువచ్చి మద్దెలతో మొరబెట్టుకున్నదిట. నకిలీ గాజులు, ముక్కు పుడక గోల్డ్‌కవరింగ్ గొలుసూ చూపి, ''రాక్‌బాటమ్ సిస్టర్ సారీ. అమ్మేశానని నలుగురికీ తెలియరాదని యివి పెట్టుకున్నా'' అని చూపుతూ పళ్లుబైటబెట్టింది భాగ్యశాలి'' అని తలతాటించింది పిన్నీ.

''పొదుపరేనే! నటించిందేమో'' అన్నది శారద.

''యేమో. సొద వెళ్లబోస్తుందేమో వినలేనని వచ్చేశా'' లేవబోయింది పిన్ని ''అంతా ఖర్చు అయేదాకా వూదరపెట్టే స్టైల్ యెవర్నీ దిగవిడిపోలేదూ''. ''అదీ జరిగింది పిన్నీ. వాళ్లద్దరూ అలివిగాలేదు నాకు. మమ్మల్ని పంపేయ్. మాకిక్కడ తోచటం లేదు. యెటూ పోనివ్వరు. గ్లూమీగా వున్నది'' అని గొడవ చేస్తే జమాన్ని తోడిచ్చి వాళ్లవాళ్లకప్పగించి ముట్టినట్టు రసీదు పట్టుకురా అని నవ్వుతూ పంపేశారు అల్లుడు. వాళ్లక్కావాల్సినవి కొనిపించుకుని మరీ వెళ్లారా యిద్దరూ. అందుకే యివ్వలేక పోతున్నా'' అని శారూ లేచింది.

''సామెతలూరికే పుట్టలేదు శారదా'' అని పిన్ని లేస్తే శారద వాకిలిదాకా వెళ్లి తలుపు తీసి పిన్ని వెళ్లాక తలుపువమూసి వచ్చి వుళ్లీ పరిశోధన కాగితాలందుకున్నది.